

అ అంటే అమ్మ

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా యలమంచిలి మండలం జంపపాలెం జెడ్పీ హైస్కూలు విద్యార్థుల అక్షర విన్యాసమిది..



సిరులతల్లికి పంచామృతాభిషేకం

శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మికి త్రికాల పంచామృతాభిషేక సేవ, విశేష హోమాలు నిర్వహించారు. 8లో



విద్యుత్ షాక్‌తో.. 8లో

అనకాపల్లి మండలంలో అవుట్ సోర్సింగ్ లైన్‌మన్ రామరాజు మరమ్మతు పనులు చేస్తూ కరెంట్ షాక్‌తో మృతి చెందాడు.

న్యూస్‌రీల్

తెలుగు భాషకు గిడుగు సేవలు చిరస్మరణీయం



గిడుగు వేంకట రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ జాహ్నవి

తుమ్మపాల: గ్రాంథికంలో ఉన్న తెలుగును వాడుక భాషకు తీసుకువచ్చి రచనలు చేయడం వల్లే భాషా సౌందర్యం ఇనుమడించిందని, దానికి వ్యావహారిక భాషోద్యమ మూలపురుషుడు గిడుగు వేంకట రామమూర్తి చేసిన కృషి చిరస్మరణీయమని జేసీ ఎం.జాహ్నవి అన్నారు. తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్‌లో తెలుగు భాషా పితామహుడు గిడుగు వేంకట రామమూర్తి జయంతి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ జాహ్నవి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

తుమ్మపాల: ప్రతి నెల ఒకటో తేదీన పంపిణీ చేసే సామాజిక పింఛన్లను ఒకరోజు ముందుగానే ఈనెల 31 శనివారం ఉదయం 6 గంటల నుంచి ఇంటింటికీ వెళ్లి అందించనున్నట్టు డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ విషయాన్ని పింఛనుదారులు గమనించి ఈ నెల 31వ తేదీన ఇంటి వద్దనే అందుబాటులో ఉండి పెన్షన్ పొందాలన్నారు. ఏదైనా కారణం చేత పింఛన్ పొందని వారు సెప్టెంబర్ 2న అందుకోగలరన్నారు.

చెన్నై-భువనేశ్వర్ స్పెషల్ రద్దు

తాటిచెట్లపాలెం (విశాఖ): నిర్వహణా పనుల నిమిత్తం చెన్నై-భువనేశ్వర్-చెన్నై స్పెషల్ రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. సెప్టెంబరు 2, 9వ తేదీల్లో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(06073) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, సెప్టెంబరు 3, 10వ తేదీల్లో భువనేశ్వర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (06074) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దయ్యాయి.

పునరావృత్తం కాకూడదు



కోల్‌కతాలో జరిగిన ఘటన పునరావృత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. రాత్రి సమయంలో సేవలందించే వైద్య సిబ్బందికి ప్రభుత్వం భరోసాగా నిలవాలి. వైద్యో నారాయణో హరి అన్న సూక్తికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలి. ప్రభుత్వం తగిన భద్రత కల్పిస్తే వైద్య సిబ్బంది ధైర్యంగా సేవలు అందించగలరు. కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

– బేగం, హెల్త్ సూపర్‌వైజర్, చూచుకొండ పీహెచ్‌సీ

ఆందోళన తొలగించాలి



ఎంతో మందికి స్వస్థత చేకూరుస్తున్న వైద్య సిబ్బందిపై పలు చోట్ల దాడులు జరగడం శోచనీయం. ఇటువంటి సందర్భాల్లోనే వైద్య సిబ్బందిలో ఆత్మస్థైర్యం లోపిస్తుంది. వారి కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంటుంది. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలను వేగవంతం చేయాలి. ఆస్పత్రుల పరిసరాల్లో సీసీ కెమెరాలు నెలకొల్పి, పోలీస్ సిబ్బందితో రాత్రి సమయాల్లో నిఘా ఏర్పాటు చేస్తే పరిస్థితి చక్కబడుతుంది.

-ఎం.నాగమణి, స్టాఫ్ నర్స్, పీహెచ్‌సీ, లంకవానిపాలెం, కె.కోటపాడు మండలం

- మునగపాక/కె.కోటపాడు

తెగిన ఐరన్ తాడు స్థానంలో కొత్తది ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



కొత్త ఐరన్ తాడు ఏర్పాటు చేస్తున్న ఇంజినీర్లు

- తాండవ ప్రాజెక్టు గేట్లకు ప్రమాదం లేకుండా చర్యలు
- తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ

నాతవరం: తెగిపోయిన తాండవ ప్రాజెక్టు ప్రధాన గేటు ఐరన్ తాడు స్థానంలో గురువారం కొత్తది ఏర్పాటు చేశారు. ప్రధాన గేటు ఐరన్ తాడు తెగిపోవడంతో 'తాండవ ప్రాజెక్టుకు పొంచి ఉన్న ముప్పు'శీర్షికతో ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ప్రాజెక్ట్ డీఈ అనురాధ స్పందించారు. గురువారం తాండవ ప్రధాన గేట్లు మరమ్మతు పనులను అనుభవం ఉన్న మెకానికల్ ఇంజినీర్‌ను రప్పించి యుద్ధప్రాతిపదికన చేపట్టారు. శిథిలమైన గేట్లకు వెల్డింగ్ పనులు చేశారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ తాండవ రిజర్వాయరు ప్రధాన ఒకటో గేటు ఐరన్ తాడు ఇటీవల తెగిపోవడంతో భయాందోళన చెందామన్నారు. ఇరిగేషన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్త ఐరన్ తాడు ఏర్పాటు చేశామన్నారు. దీంతో తాండవ ప్రధాన గేట్లకు, రిజర్వాయరుకు ఎలాంటి ప్రమాదం లేదని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తాండవ ప్రాజెక్టులో గురువారం సాయంత్రానికి 377.5 అడుగులకు నీటిమట్టం పెరిగిందన్నారు. ప్రస్తుతం తాండవ ప్రధాన గేట్ల ద్వారా ఆయకట్టు భూములకు రోజుకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో నీరు తాండవ ప్రాజెక్టులోకి రోజుకు 400 క్యూసెక్కులు చేరుతుందన్నారు. ప్రాజెక్టుకు ప్రమాదం లేకుండా ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో నీటిని బేరీజు వేసుకుని తాండవ నదిలోకి నీటిని విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు జేఈ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



శిథిలమైన ప్రధాన గేట్లకు వెల్డింగ్ చేస్తున్న సిబ్బంది

వేములపూడి హైస్కూల్‌కు ఉత్తమ క్రీడా పురస్కారం

నర్సీపట్నం: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వేములపూడి ఉన్నత పాఠశాల 189 పాయింట్లతో జిల్లాలో మొదటిస్థానంలో నిలిచి ఉత్తమ క్రీడా పురస్కారాన్ని కైవసం చేసుకుంది. 32 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ, ఆరుగురు విద్యార్థులు జాతీయస్థాయిలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి పురస్కారాన్ని సాధించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ చేతుల మీదుగా అనకాపల్లిలో గురువారం జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం జి.రమణ, పీడీ రవి పురస్కారం అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం రమణ, పీడీ రవి, విద్యార్థులు

ఈ నెల జీతాలు అందేనా?

హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ (పేరు మార్చాం) ఎసైన్షియా ఫార్మా కంపెనీలో ప్రొడక్షన్ కెమిస్ట్‌గా గతేడాది నుంచి పని చేస్తున్నాడు. గాజువాకలో అద్దె ఇంట్లో ఉంటూ రోజూ అచ్యుతాపురం వెళ్తొస్తున్నాడు. ఈ నెల 21న మొదటి షిఫ్ట్ విధులు ముగించుకుని శ్రీకాంత్ వెళ్లిన 30 నిమిషాల్లోనే కంపెనీలో ప్రమాదం జరిగింది. దీంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నానని ఊపిరి పీల్చుకున్నాడు. అయితే రోజులు గడిచాయి. సెప్టెంబర్ ఒకటో తేదీ వస్తోంది. ఇంటి అద్దె కట్టాలి.. నిత్యావసర సరకులు కొనాలి.. పిల్లల ఫీజులు కట్టాలి.. కుటుంబం గడవాలి.. ఈ ప్రశ్నలు శ్రీకాంత్‌ను వేధిస్తున్నాయి. ఎందుకంటే ఈ నెల జీతం వస్తుందా..? రాదా? అన్న అనుమానం ఆయనలో ఉంది. కంపెనీ ఉత్పత్తి పునః ప్రారంభం కావడానికి ఇంకా చాలా సమయం పట్టే అవకాశం ఉంది. అసలు తెరుస్తారా? లేదా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమస్య ఒక్క శ్రీకాంత్‌దే కాదు. ఎసైన్షియా ఫార్మా కంపెనీలో పని చేస్తున్న 315 మంది కార్మికులది కూడా.

- ఎసైన్షియా ఫార్మా కంపెనీ ఉద్యోగుల దిగాలు
- ప్రమాదం అనంతరం ప్లాంటులో ఉత్పత్తి నిలిపివేత
- ఉద్యోగం ఉన్నట్టా.. లేనట్టా తెలీక అయోమయం
- ప్లాంట్ ఎప్పుడు తెరుస్తారోనని ఉద్యోగుల ఎదురుచూపులు



సాక్షి, అనకాపల్లి: చావు నుంచి బతికి బయటపడ్డాం రా.. దేవుడా..! అని ఊపిరి పీల్చుకుంటున్న అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మా కంపెనీ ఉద్యోగులకు జీతాల రూపంలో కొత్త తలనొప్పి ఎదురవుతోంది. ఈ నెల జీతం వస్తుందా! ప్లాంట్‌లో ఉత్పత్తి పునః ప్రారంభమవుతుందా? అసలు ఉద్యోగాలు ఉంటాయా? అన్న సందేహాలు ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్నాయి. నెలాఖరు రావడంతో ఇంటి అద్దెలు, కుటుంబ పోషణపై ఆందోళన మొదలైంది. నెలాఖరు వచ్చినా కంపెనీ నుంచి ఎటువంటి సమాచారం లేదు. పోనీ ప్రభుత్వమైనా జోక్యం చేసుకుందా? అంటే అదీ లేదు. కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు విచారణ కమిటీ వేశారు. ప్రస్తుతం విచారణ జరుగుతోంది. ఉద్యోగుల జీతాలపై మాత్రం ఎటువంటి ప్రకటన లేకపోవడంతో ఆయా కుటుంబాల్లో నిరాశ నిస్పృహలు నెలకొన్నాయి.

శుభవార్త కోసం ఎదురుచూపులు

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఎసైన్షియా ఫార్మా కంపెనీలో ఈ నెల 21న జరిగిన భారీ అగ్ని ప్రమాదం తరువాత తాత్కాలికంగా ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిపివేశారు. దీంతో కంపెనీలో పనిచేసే మొత్తం 315 మంది శాశ్వత, తాత్కలిక ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. తమ ఉద్యోగాలు ఉంటాయా? లేదంటే ఊడుతాయా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. నెల రోజుల్లో ఉత్పత్తి పునః ప్రారంభమైతే పర్వాలేదు.. లేదంటే మరో కంపెనీలో ఉద్యోగం చూసుకోవాలనే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో ప్లాంట్ తెరవడానికి 3 నుంచి 4 నెలల పాటు పట్టే అవకాశం కనిపిస్తోంది. అప్పటి వరకూ జీతాలు రాకపోతే తమ పరిస్థితి ఏమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. కనీసం ఈ నెల జీతాలైనా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నాన్ లోకల్ వారే ఎక్కువ

అనకాపల్లి, విశాఖ జిల్లాల వారి కన్నా ఇతర జిల్లాల వారే ఈ కంపెనీలో ఎక్కువగా ఉద్యోగాలు చేస్తున్నారు. 25 శాతం వరకూ ఇతర రాష్ట్రాల వారు కూడా ఉన్నారు. అందరూ కుటుంబంతో విశాఖలో నివసిస్తున్నారు. యాజమాన్యం జీతాలు ఇవ్వకపోతే ఒక వైపు అద్దెలు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

హెల్పర్లకు మాత్రమే సమాచారం!

అచ్యుతాపురం ఎసైన్షియా ఫార్మా కంపెనీలో ఉన్న మొత్తం శాశ్వత, తాత్కాలిక ఉద్యోగుల్లో హెల్పర్లకు మాత్రమే ఆగస్టు నెల జీతం ఇస్తామని ఆ కంపెనీ సూపర్‌వైజర్ సమాచారం అందజేశారు. అయితే శాశ్వత ప్రాతిపదికన పని చేసే ఉద్యోగులకు ఎటువంటి సమాచారం లేకపోవడం గమనార్హం. హెల్పర్ల జీతాలు తక్కువగా ఉంటాయని, అందుకే వారికి అందిస్తున్నట్లు చెబుతున్నారు.

హెల్పర్లకు ఈ నెల జీతం ఇస్తారట..

రెండు రోజుల క్రితం ఎసైన్షియా ఫార్మా కంపెనీ సూపర్‌వైజర్ హెల్పర్లతో సమావేశమయ్యారు. నేను వెళ్లలేదు. తాత్కాలిక ఉద్యోగులైన హెల్పర్లకు ఈ నెల జీతం ఇస్తామని చెప్పారట. నా తోటి ఉద్యోగుల ద్వారా తెలుసుకున్నాను. వచ్చే నెల నుంచి అయితే గ్యారంటీ లేదు. మిగతా శాశ్వత ఉద్యోగుల జీతాల విషయం మాకు తెలియదు.

– ఎసైన్షియా తాత్కాలిక ఉద్యోగి (హెల్పర్), మోటూరుపాలెం గ్రామం

శాశ్వత ఉద్యోగులకు స్పష్టత ఇవ్వాలి

ఎసైన్షియా ఫార్మా కంపెనీలో ఏడాదిగా ఉద్యోగం చేస్తున్నాను. ప్రమాదం జరిగిన రోజు రెండో షిఫ్ట్‌లోనే ఉన్నాను. కానీ ప్రమాద స్థలానికి దూరంగా ఉండడంతో ప్రాణాలతో బయట పడ్డా. నెలాఖరు కావస్తోంది. ఈ నెల జీతాలపై ఎటువంటి సమాచారం లేదు. దీనిపై కంపెనీ యాజమాన్యం స్పష్టతనివ్వాలి.

– ఎసైన్షియా కంపెనీ శాశ్వత ఉద్యోగి, రాంబిల్లి మండలం

10వ తేదీలోగా జీతాలు వేయాలి

ఎసైన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ఘటనపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ కొనసాగుతోంది. ఉద్యోగుల జీతాలకు సంబంధించి కార్మిక వేతనాల చట్టం ప్రకారం చెల్లించాలి. ఈ నెల వర్కింగ్ నెల కావున జీతాలకు ఆటంకం ఉండదు. నియమ నిబంధనల ప్రకారం సెప్టెంబర్ 10వ తేదీలోగా ఉద్యోగులకు జీతం వేయాలి. అప్పటికీ వేయకపోతే యాజమాన్యాన్ని ఆదేశిస్తాం. వచ్చే నెల నుంచి జీతాలు ఇవ్వాలా? వద్దా? అనేది విచారణ కమిటీ నివేదికలో పొందుపరుస్తాం.

– చిన్నారావు, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, అనకాపల్లి జిల్లా

ఇప్పుడు ముంపు కాదా?



వైర్‌లెస్ కాలనీలో జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి రూపొందించిన డిజైన్స్

రైల్వే జోన్‌కు ముడసర్లోవ భూములే ఫైనల్

రైల్వే జోన్ ఆలస్యం కావడానికి కారణం రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన భూమి ఇంకా రైల్వే శాఖకు అందలేదు.

– కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

జోన్‌కు భూములిచ్చేశామని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెబుతోంది. కానీ ఇచ్చింది ముంపు భూమి. అది నిర్మాణాలకు పనికిరాదు.

– రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ నిర్మించాలని భావించాం. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భూమి ఇవ్వలేదు. జోన్ పనులు ఎలా జరుగుతాయి.? :

– తాళ్లపాలెం సభలో ప్రధాని నరేంద్రమోదీ

మనకు రైల్వే జోన్ వచ్చేది. జగన్ ప్రభుత్వం పనికిరాని స్థలం ఇచ్చేసింది. అందుకే జోన్ రాలేదు.

– అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు

ఇవన్నీ గత ఎన్నికల ముందు బీజేపీ, టీడీపీ నేతల వ్యాఖ్యలు.

- గత జనవరిలోనే రైల్వేకి అప్పగించిన నాటి ప్రభుత్వం
- అది ముంపు భూమి అంటూ బీజేపీ, టీడీపీ నేతల ఆరోపణలు
- జోన్ ఏర్పాటు చేయకుండా ఎన్నికల సమయంలో విమర్శలు
- ప్రత్యామ్నాయ భూములిస్తేనే నిర్మాణ పనులన్న మంత్రి అశ్వినీ వైష్ణవ్
- ఇప్పుడు అవే భూములకు ఓకే చెప్పిన రైల్వే మంత్రి



ముడసర్లోవలో రైల్వేకు అప్పగించిన భూములివే..

సాక్షి, విశాఖపట్నం : సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ ప్రకారం మిక్స్‌డ్ జోన్‌లో ఉన్న భూమిని అప్పగిస్తే.. కేవలం ఎన్నికల స్టంట్ కోసం కూటమి నేతలు అసత్య ప్రచారాలు చేశారు. ప్రజలను నమ్మించేందుకు ఏకంగా కేంద్ర మంత్రులు కూడా పదే పదే అబద్ధాలు వల్లె వేశారు. అబ్బే.. ఇచ్చింది ముంపు భూమి అంటూ విమర్శలు గుప్పిస్తూ జోన్ ఏర్పాటు చేయకుండా తప్పించుకున్నారు. ఇప్పుడేమో ఆ భూమి నిర్మాణాలకు ఓకే అంటూ రైల్వే అధికారులు ప్రకటించడం.. త్వరలోనే జోన్ ప్రధాన కార్యాలయం పనులు ప్రారంభిస్తామని రైల్వే మంత్రి చెప్పడం గమనార్హం.

అప్పుడు టీడీపీ ఏం చేసింది?

రోడ్డు విస్తరణలో భాగంగా పెందుర్తి ట్రాన్సిట్ కారిడార్ మంజూరు చేసిన సమయంలో రోడ్డు నిర్మాణానికి, రైల్వే భూముల్లో తరాలుగా ఉన్న మురికివాడల అభివృద్ధికి మొత్తం 26.11 ఎకరాలు అవసరమయ్యాయి. దీనిపై రైల్వే అధికారులతో దఫ దఫాలుగా జరిపిన చర్చలు సఫలీకృతం కాలేదు. చివరికి 1:2 నిష్పత్తిలో అంటే 52.22 ఎకరాలు ముడసర్లోవలో ఇచ్చే ప్రతిపాదనకు రైల్వే అధికారులు అంగీకరించారు. ముడసర్లోవ స్థలం రైల్వేకి ఇచ్చేందుకు 2013 ఫిబ్రవరి 2న నం.55/12తో జీవీఎంసీ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. దీనిని ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2015 నవంబర్ 26న జీవో ఎంఎస్ నం. 254 జారీ చేసింది. ముడసర్లోవలో సర్వే నెం.26లో జీవీఎంసీకి చెందిన సుమారు 270 ఎకరాలు పోరంబోకు ఉండగా, ఇందులో 52 ఎకరాలు రైల్వే శాఖకి అప్పగించేందుకు నిర్ణయించారు. అప్పట్లో రైల్వే అధికారులతో సంయుక్తంగా తనిఖీలు చేసి, వారు ఆమోదించిన తర్వాతే భూమి అప్పగింత చర్యలు చేపట్టారు. జీవీఎంసీ, రైల్వేల మధ్య 2013లో ఒప్పందం కుదిరితే 2014 నుంచి 2019 వరకూ ఐదేళ్లపాటు టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉంది.

అటు కేంద్రంలో కూడా ఉన్నది ఎన్డీయే ప్రభుత్వమే. అలాంటప్పుడు ఆ ప్రభుత్వాల హయాంలో ఈ భూములను రైల్వేకు ఎందుకు అప్పగించలేదంటే కూటమి నేతల దగ్గర సమాధానం లేదు.

'మిక్స్‌డ్ జోన్' అని చెప్పినా అసత్య ప్రచారం

వాస్తవానికి రైల్వేకు ఇచ్చిన ఈ స్థలం వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం మిక్స్‌డ్ జోన్ అని, ఏ విధమైన భవనాలైనా నిర్మించుకునేందుకు అనుకూలమని ధ్రువీకరించారు. ఆ భూమి చెరువు బ్యాక్ వాటర్‌లో లేదని, ముడసర్లోవ రిజర్వాయర్‌లో భాగం కాదని, ముంపునకు గురయ్యే అవకాశమే లేదని మాస్టర్‌ప్లాన్‌లో స్పష్టం చేశారు. ఈ విషయంపై రైల్వే అధికారుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు, లేఖలు రాలేదు కూడా. అక్కడ ఉన్న ఆక్రమణల్ని తొలగించి స్థానికులతో సంప్రదింపులు చేసి.. సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి రెవెన్యూ శాఖ మొత్తం స్థలానికి కంచె కూడా వేసింది. రైల్వేకు ఇవ్వాల్సిన 52.22 ఎకరాల భూమిని క్లియర్ టైటిల్‌తో సిద్ధం చేశారు. వాల్తేరు డీఆర్ఎంకు ఈ ఏడాది జనవరి 2న లేఖలు రాసి అప్పగించారు. కానీ అది ముంపు ప్రాంతమంటూ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు అసత్య ప్రచారాలు చేశారు.

దాచేసిన శిలాఫలకం ఎక్కడ?

విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు 2019లో కేంద్రం పచ్చజెండా ఊపింది. జోన్‌కు సంబంధించిన డీపీఆర్‌ని అదే ఏడాది ఆఖరిలో ఇచ్చేశారు. 2022లో ముందుగా జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి డీఆర్ఎం కార్యాలయం ఎదురుగా ఉన్న వైర్‌లెస్ కాలనీని ఎంపిక చేశారు. అక్కడ ఉన్న 13 ఎకరాల్లో 8 ఎకరాల్లో హెడ్‌క్వార్టర్స్‌కు సంబంధించి డిజైన్లకు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆమోదముద్ర వేశారు. కాలనీని సైతం పరిశీలించారు. రూ.106 కోట్ల వ్యయంతో జోన్ ప్రధాన కార్యాలయానికి టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమయ్యారు. టెండర్లు ఖరారు చేసిన తర్వాత అగ్రిమెంట్ జరిపి 36 నెలల్లో భవనాలను పూర్తి చేయాలని రైల్వే అధికారులు భావించారు. 2022 నవంబర్ 12న ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారనీ.. శిలాఫలకం కూడా సిద్ధం చేశారు. కానీ 11వ తేదీ అర్ధరాత్రి 12 గంటల తర్వాత శంకుస్థాపన కార్యక్రమాన్ని వాయిదా వేసేశారు. సిద్ధం చేసిన శిలాఫలకాన్ని దాచేశారు. దీనంతటికీ కారణం.. స్థానిక బీజేపీ, టీడీపీ నేతలే అనే ఆరోపణలు గతంలోనే వినిపించాయి. అప్పుడు శంకుస్థాపన చేస్తే క్రెడిట్ అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందనే రాజకీయ కుట్రతో ఉత్తరాంధ్రవాసుల కలల్ని కల్లలు చేసేశారు. తర్వాత ముంపు భూమి పేరుతో రాజకీయాలు చేసి మోసం చేశారు.



జోన్ పనుల ప్రారంభోత్సవ శిలాఫలకం

యలమంచిలి కమిషనర్‌గా ప్రసాదరాజు

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌గా బీజేఎస్ ప్రసాదరాజు నియమితులయ్యారు. ప్రస్తుతం ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏవోగా పనిచేస్తున్న ఆయనను యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ప్రసాదరాజు గతంలో 9 నెలలు యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. ఇప్పటివరకు యలమంచిలి ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పనిచేసిన డి.ప్రభాకరరావు స్థానంలో ప్రసాదరాజు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఏయూలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో భారీ సంఖ్యలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వీసీ ఆచార్య జి. శశిభూషణరావు తెలిపారు. నాలుగేళ్లకుపైబడి వయసున్న వేప, మామిడి, రావి, నేరేడు, బాదం, మర్రి, కదంబరి తదితర మొక్కలు నాటడానికి సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే వెయ్యికి పైగా మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో కలిసి వీసీ గురువారం ఈ ఏర్పాట్లను పరిశీలించారు. ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో రహదారికి ఇరువైపులా మూడు వరసల్లో మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. మైదానం చుట్టూ మొక్కలు నాటుతామన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న వీసీ శశిభూషణరావు

క్లుప్తంగా

నేడు హైకోర్టు న్యాయమూర్తుల రాక

మహారాణిపేట(విశాఖ): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ టిఎస్ రవి శుక్రవారం విశాఖ వస్తున్నారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. ఈనెల 31న సిరిపురం చిల్డ్రన్స్ ఎరీనాలో మహిళా న్యాయవాదులు సదస్సులో పాల్గొంటారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు తాత్కాలికంగా మరిన్ని అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. సంబల్‌పూర్-నాందేడ్(20809) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 1 నుంచి 30వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో), నాందేడ్ -సంబల్‌పూర్ (20810) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 2 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ ఎకానమి, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు. సంబల్‌పూర్-ఈరోడ్ (08311) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 4 నుంచి 25వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో), ఈరోడ్-సంబల్‌పూర్ (08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు 6 నుంచి 27వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ ఎకానమి, ఒక స్లీపర్ క్లాస్ కోచ్ జతచేస్తున్నారు.

అపార్ట్‌మెంట్‌పై పిడుగు

మధురవాడ(విశాఖ): శివశక్తినగర్ రోడ్డులోని లక్ష్మీటవర్స్ అపార్ట్‌మెంట్‌పై బుధవారం రాత్రి పిడుగుపడింది. ఈ కారణంగా 6వ అంతస్తు పైన పిల్లర్, గోడ దెబ్బతిన్నాయి. అపార్ట్‌మెంట్‌లోని కొన్ని ఫ్లాట్లలో టీవీలు, ఫ్యాన్‌లు, విద్యుత్ పరికరాలతో పాటు మూడు లిఫ్టులు దెబ్బతిన్నాయి. ఈదురు గాలులకు శివశక్తినగర్ రోడ్డులోని ముత్యాలమ్మ కాలనీ సమీపంలో విద్యుత్ తీగలు తెగిపోయాయి. చాలా సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మిథిలాపురి వుడా కాలనీ, చంద్రంపాలెం, స్వతంత్రనగర్, వాంబే కాలనీల్లో విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

తల్లికి తనయ అంత్యక్రియలు



తల్లి అంత్యక్రియల్లో పాల్గొన్న వరలక్ష్మి

మాడుగుల: కొడుకు లేని లోటు తీర్చింది.. కూతురే తల్లికి అంత్యక్రియలు నిర్వహించింది. మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన ములంపాక గాదాలమ్మ (55) కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ గురువారం మృతి చెందింది. ఆమెకు కుమారులు లేకపోవడంతో, దాయాదులు కూడా చొరవ చూపకపోవడంతో చిన్న కుమార్తె వరలక్ష్మి ముందుకు వచ్చి తల్లికి అంత్యక్రియలు నిర్వహించి కుమారులు లేని లోటు తీర్చింది.

వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి



వైద్య సేవలందించే ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. రాత్రి సమయంలో తప్పనిసరిగా పోలీస్ పెట్రోలింగ్ జరిగేలా చూడాలి. మహిళా వైద్య సిబ్బందిపై హత్యాచారాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మహిళా సిబ్బందికి ప్రత్యేక వాష్‌రూమ్ సదుపాయాలు కల్పించాలి. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిని హత్య చేసిన నిందితుడిని వదిలి పెట్టొద్దు.

- శాంతి, స్టాఫ్ నర్స్, హరిపాలెం పీహెచ్‌సీ



రాత్రిళ్లు విధులంటే భయమేస్తోంది



ప్రభుత్వ ఆస్పత్రుల్లో రాత్రిళ్ల విధులు నిర్వర్తించే వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటనతో రాత్రిపూట విధులు నిర్వహించాలంటే భయమేస్తోంది. ప్రభుత్వాలు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు పోలీసు బందోబస్తు కల్పించాలి. ఎంతో మందికి ప్రాణాలు పోసే వైద్యులపై హత్యాచారాలకు, దాడులకు తెగబడటం అమానుషం.

- జి.రాణి, స్టాఫ్ నర్స్, దేవరాపల్లి పీహెచ్‌సీ

- మునగపాక/దేవరాపల్లి

వేసిన తాళాలు వేసినట్టే.. ఇల్లు మాత్రం గుల్ల



ఇంటి ముంగిట కూర్చొని ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు అచ్చిబాబు, జ్యోతి



ఇంటిలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్, సీఐ స్వామినాయుడు

- దేవరాపల్లిలో పట్టపగలే భారీ చోరీ
- 4 తులాల బంగారం, రూ.1.50 లక్షలు మాయం

నిత్యం జన సంచారం ఉండే ప్రాంతం.. నడిరోడ్డుకు అనుకున్న ఇంట్లో పట్టపగలే భారీ చోరీ జరిగింది. ఇంటికి వేసిన తాళాలు వేసినట్టే ఉన్నాయి. కానీ విలువైన ఆభరణాలు, నగదు మాయమయ్యాయి. ఈ ఘటన దేవరాపల్లిలో గురువారం చోటు చేసుకుంది.

దేవరాపల్లి: స్థానిక బండారు వీధిలో గురువారం భారీ చోరీ జరిగింది. గుర్తు తెలియన వ్యక్తులు ఇంటి కబోర్డులో ఇంట్లో 4 తులాల బంగారు నగలు, రూ.1.50 లక్షలు ఎత్తుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు పరిశీలించి ఆధారాలు సేకరించారు. బాధితుడి కథనం ప్రకారం.. తన ఇంట్లో గుల్లిపల్లి అచ్చిబాబు, భార్య జ్యోతి, తల్లిదండ్రులు అప్పలనాయుడు, నారాయణమ్మ నివాసం ఉంటున్నారు. అచ్చిబాబు స్థానికంగా ఫొటో స్టూడియో నిర్వహిస్తుండగా, భార్య జ్యోతి ప్రైవేటు స్కూల్‌లో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో బైక్ కీతో కలిపి ఉన్న తాళాల గుత్తు కనిపించక పోవడంతో ఆందోళనకు గురయ్యారు. వెతికి వెతికి దొరక్కపోవడంతో వారి పనులపై వెళ్లిపోయారు. ఆ తర్వాత తన తండ్రి పొలంలోకి వెళ్లిపోగా, తల్లి నారాయణమ్మ తన దగ్గర ఉన్న మరో తాళంచెవితో ఇంటికి తాళం వేసి పక్కింటి వారికి ఇచ్చి విశాఖపట్నంలోని బంధువుల వద్దకు వెళ్లింది. మధ్యాహ్నం ఫొటో స్టూడియో నుంచి ఇంటికి వచ్చిన అచ్చిబాబు పక్కింటి వారి దగ్గర తాళంతో తలుపు తీసి భోజనం చేశాడు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బ్యాంకులో లోన్ సొమ్ము కట్టేందుకు కబోర్డు తలుపు తీసేందుకు వెళ్లగా, అప్పటికే తెరిచి ఉండటాన్ని గుర్తించి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. కబోర్డు (గోడ బీరువా)లోని స్టీల్ బాక్స్‌లో భద్రపరిచిన రూ.1.50 లక్షలతోపాటు నాలుగు తులాల బంగారు ఆభరణాలు కనిపించక పోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఉదయం కనిపించకుండా పోయిన తాళాలు మంచం కింద ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు రంగ ప్రవేశం చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిత్యం జన సంచారం ఉండే రోడ్డుకు ఆనుకున్న ఇంట్లో చోరీ జరగడంతో స్థానికులు సైతం నివ్వెరపోతున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నామని కె.కోటపాడు సీఐ స్వామినాయుడు తెలిపారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో కలిసి పోలీసులు చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలు, తదితర ఆధారాలు సేకరించారు.

నిరుపయోగంగా ఏపీఐఐసీ భూములు

- సేకరించి 9 ఏళ్లయినా ఏర్పాటు కాని పరిశ్రమలు
- సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి: టీడీపీ గత ప్రభుత్వ హయాంలో 9 సంవత్సరాల క్రితం ఏపీఐఐసీ మూడు వేల ఎకరాల భూమి సేకరించి నేటికీ పరిశ్రమలు ఏర్పాటు చేయలేదని సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ విమర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి మండలంలోని వల్లూరు, ఎరుకువానిపాలెం, రాజుపాలెం, గొర్లివానిపాలెం, ముగపాక గ్రామాలవారు, పరవాడ మండలంలో రైతులు మొత్తం 830మంది భూములు ఇచ్చారని చెప్పారు. లాజిస్టిక్ హబ్ పేరుతో రైతులకు నష్టపరిహారం చెల్లించారని, ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించినట్లయితే జిల్లాలో వేలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ భూములను నిరుపయోగంగా వదిలేయడం వలన అటు రైతులు పంటలు పండించుకోక, ఇటు పారిశ్రామిక అభివృద్ధి లేక ఈ గ్రామాల ప్రజలు జీవనోపాధి కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి పట్టణం చుట్టుపక్కల వేలాది ఎకరాల భూమిని సేకరించారని, కూటమి ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రుత్తల శంకరరావు, వి.వి.ఎస్. శ్రీనువాసరావులు అల్లు రాజు, మండల కమిటీ సభ్యులు బొప్పే ఉమామహేశ్వరరావు, బుగిడి నూకఅప్పారావు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

కొట్లాట కేసులో రూ.10 వేల జరిమానా

రాంబిల్లి (యలమంచిలి): కొట్లాట కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి యలమంచిలి కోర్టు మూడు నెలలు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించినట్లు రాంబిల్లి సీఐ సీహెచ్ నర్సింగరావు గురువారం రాత్రి తెలిపారు. మండలంలో వైలోవ గ్రామానికి చెందిన బద్ది నాగేశ్వరరావు 2015లో మరో వ్యక్తితో ఘర్షణ పడగా, అప్పటి రాంబిల్లి పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. తాజాగా యలమంచిలి కోర్టులో నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు ఇచ్చిందన్నారు. నిందితుడు రూ.10 వేల జరిమానా చెల్లించినట్లు తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

రాంబిల్లి మండలం వాడనర్సాపురం గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో గురువారం ఇరువర్గాలు మధ్య జరిగిన కొట్లాటలో కేసు నమోదు చేసినట్లు సీఐ సీహెచ్ నర్సింగరావు తెలిపారు. ఈ కోట్లాటలో ఇరువర్గాలకు చెందిన వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రోగుల పట్ల స్నేహ పూర్వకంగా వ్యవహరించాలి

- నక్కపల్లి ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేసిన డీసీహెచ్ శ్రీనివాసరావు



రోగులకు పెట్టే భోజనం పరిశీలిస్తున్న డీసీహెచ్

నక్కపల్లి: రోగుల పట్ల స్నేహ పూర్వకంగా వ్యవహరించాలని, సకాలంలో వైద్యం చేసి మన్ననలు పొందాలని వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని వార్డుల్లో పర్యటించారు. ఇన్‌పేషెంట్ల వార్డుల్లో రోగుల వద్దకు వెళ్లి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఏ సమస్యలతో చేరారు. వైద్య సేవలు ఎలా ఉన్నాయి. సిబ్బంది వ్యవహార శైలి ఎలా ఉంది. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. సకాలంలో సిబ్బంది స్పందిస్తున్నారా లేదా అనే వివరాలను ఆరా తీశారు. ఆస్పత్రిలో శానిటేషన్‌ను పరిశీలించారు. వార్డులు, ఆస్పత్రి పరసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలన్నారు. అనంతరం ఇన్‌పేషెంట్లకు పెట్టే భోజనాన్ని పరిశీలించారు. నాణ్యతతో కూడిన భోజనాన్ని సరఫరా చేయాలన్నారు. ఆస్పత్రిలో ఫార్మసీ విభాగాన్ని పరిశీలించి, మందుల కొరతపై ఆరా తీశారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రిలో పని చేసే వైద్యులు, సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. ఇటీవల కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన నేపథ్యంలో అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ తెలిపారు.

వలస నేతకు వ్యతిరేకంగా ఏకమైన టీడీపీ నేతలు

- దేవరాపల్లిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన సీనియర్ నాయకులు



సంతతోటలో ఇళ్ల నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ సీనియర్ నాయకులు

దేవరాపల్లి: వలస నేతకు వ్యతిరేకంగా టీడీపీ నేతలు ఏకమయ్యారు. వీరి మధ్య ఇళ్ల నిర్మాణాల విషయమై వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో ఇళ్లు నిర్మించుకుంటున్న కార్యకర్తలకు ఆ పార్టీ సీనియర్ నాయకులు మద్దతు పలికారు. స్థానిక సంతతోటలోని సర్వే నంబర్ 175/4లో రోడ్డు విస్తరణ నిర్వాసితులతోపాటు స్థానికులకు కేటాయించిన 18 సెంట్ల స్థలంలో ఇళ్లు నిర్మిస్తుండగా, ఇటీవల వలస నేత వర్గీయులు అడ్డగించారు. దీంతో వలస నేత, టీడీపీ నేతల మధ్య వివాదం రాజుకుంది. రెండు రోజుల క్రితం సదరు వలస నేత తీరుపై గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్లె దేముళ్లు సహా పలువురు కార్యకర్తలు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి ఫిర్యాదు చేశారు. తాజాగా ఇళ్ల నిర్మాణ స్థలాన్ని టీడీపీ సీనియర్ నాయకులు ఎల్లేటి కరుణాకర్‌రావు, గాలి రవికుమార్, గంగవంశం సత్తిరాజు, కొరుపోలు చంద్రరావు, దుక్క సత్తిబాబు, రొంగలి గోవిందమ్మ, బాబ్జి తదితరులు గురువారం పరిశీలించారు. ఇళ్లు నిర్మించుకుంటున్న టీడీపీ కార్యకర్తలకు ఆ పార్టీ సీనియర్ నాయకులు మద్దతు ప్రకటించడం వలస నేతకు కొంత ఇబ్బంది కలిగించే అంశంగా మారింది. ఈ వివాదంలో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు పైచేయి సాధించేందుకు ప్రయత్నాలు చేస్తుండగా, ఎమ్మెల్యే బండారు ఎవరికి మద్దతిస్తారో వేచి చూడాల్సి ఉంది.

మైమరపించిన నర్తనశాల పద్య నాటకం



ముఖ్యఅతిథి ఆచార్యులు శ్రీకాంత్‌కు సత్కారం



నర్తనశాల నాటకంలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం (విశాఖ): కళాభారతి, విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 38వ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఆరు రోజుల పాటు జాతీయ సంగీత నృత్యోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆఖరి రోజున తిరుపతికి చెందిన సుబ్బరాజు నాట్యకళాపరిషత్ వారిచే నర్తనశాల పాన్ ఇండియా పద్య నాటక ప్రదర్శించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి ఆచార్యులు శ్రీకాంత్‌తో కలిసి వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎ స్.ఎస్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్‌లు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మహాభారతం విరాటపర్వంలోని కథాంశం ఇతివృత్తంగా అద్భుతమైన సన్నివేశాలు, సందర్భోచితమైన పద్యాలతో నర్తనశాల నాటకాన్ని రక్తికట్టించి అద్యంతం ప్రేక్షకుల హృదయాలను కట్టిపడేశాల ప్రదర్శించి మైమరపించారు. సుబ్బరాజు నాట్యకళాపరిషత్ వారిచే ప్రదర్శించిన నర్తనశాల నాటక రచయిత, దర్శకుడు కోనేటి సుబ్బరాజును నాటక కళాభారతి బిరుదుతో వీఎండీఏ ప్రతనిధులు ఘనంగా సత్కరించారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్(విశాఖ): శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు గురువారం 25వ రోజుకు చేరాయి. అమ్మవారికి విశేష పూజలు, త్రికాల పంచామృతాభిషేక సేవ, విశేష హోమాలు నిర్వహించారు. విశిష్ట శ్రావణలక్ష్మీ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పరోక్షంగా పూజలు చేయదలచుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081కు పూజా రుసుం జమచేసి వారి పేరు, గోత్ర నామం, చిరునామాను 89855 15989కు వాట్సాప్ చేయాలి. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేకం

కనకమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరగనున్న ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించాలి. వివరాలకు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

చివరి శుక్రవారం పూజలు నేడు

ఈ నెల 5 నుంచి ప్రారంభమైన శ్రావణ మాస పూజలు వచ్చే నెల 3తో ముగియనున్నాయి. నాలుగో శుక్రవారం నిర్వహించనున్న విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలచే దంపతులు రూ.400 పూజా రుసుం చెల్లించాలి.


'చంద్రపాలెం' విద్యార్థులకు పతకాలు



విజేతలతో ఇన్‌చార్జి హెచ్‌ఎం సోమయాజులు తదితరులు

మధురవాడ: రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్, రెజ్లింగ్ పోటీల్లో చంద్రంపాలెం విద్యార్థులు పతకాలు సాధించారు. రేణిగుంటలో ఈ నెల 25, 26 తేదీల్లో 4వ రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్, రెజ్లింగ్ పోటీలు జరిగాయి. ఇందులో అండర్-13 బాలుర విభాగంలో కె.పవన్, పి.రవి స్వర్ణాలు, అండర్-15 బాలికల విభాగంలో జీవిత వెండి, ఎం.లలిత కాంస్యం, జూనియర్ విభాగంలో ఎస్.గాయత్రి స్వర్ణం, వెండి పతకాలు, బాలుర విభాగంలో టి.నరేంద్ర, నితిష్, రేవంత్ సాయి బంగారు పతకాలు, పవన్, సాయికుమార్ వెండి పతకాలు, క్యాడెట్స్ విభాగంలో జీవన్ కుమార్, చైతన్య బంగారు పతకాలు, జి.హర్ష, పి.కార్తీక్, కార్తికేయ వెండి పతకాలు సాధించారు. వీరంతా అక్టోబర్‌లో హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్‌వీఎస్ సోమయాజులు, పీడీ రాము విజేతలను అభినందించారు.

బాల గాయకుడికి స్పీకర్ అభినందన



నర్సీపట్నం: బాల గాయకుడు దొంతంశెట్టి ధీరజ్‌ను అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అభినందించారు. మార్చి 20న నర్సీపట్నం సత్యసాయిబాబా మందిరంలో 77 సార్లు సంపూర్ణ వందేమాతరం నిర్విరామంగా పాడినందుకు ప్రతిష్టాత్మక ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్నాడు. ఇటీవల జరిగిన కార్యక్రమంలో స్పీకర్ నుంచి అవార్డు అందుకున్నట్టు ధీరజ్ గురువారం తెలిపాడు.

విద్యుత్ లైన్ బాగు చేస్తుండగా హెల్పర్ దుర్మరణం



ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద మృతుడి భార్య భారతి, కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) మృతుడు రామరాజు

అనకాపల్లి : మండలంలో జగన్నాథపురం గ్రామానికి చెందిన జౌట్ సోర్సింగ్ లైన్‌మన్ బోయిన రామరాజు (40) విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తూ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు కథనం మేరకు వివరాలివి. అనకాపల్లి మండలం విద్యుత్‌శాఖ పరిధిలో జగన్నాథపురం గ్రామంలో రామరాజు జౌట్‌సోర్సింగ్ లైన్‌మన్ హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామంలో విద్యుత్ లేకపోవడంతో కరెంట్ పోల్ ఎక్కి వైర్లు మరమ్మతు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడి అక్కడే మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పరిహారం చెల్లించాలని ధర్నా

విధి నిర్వహణలో భాగంగా కరెంట్‌పోల్ ఎక్కి రిపేరు చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన హెల్పర్ కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. విద్యుత్‌శాఖ ఉన్నత స్థాయి అధికారులు విద్యుత్‌శాఖ ద్వారా వచ్చే రూ.15 లక్షలు తప్ప అదనంగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేమని చెప్పడం అన్యాయన్నారు. విధి నిర్వహణలో మృతిచెందిన రామరాజు కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని, మృతుడి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో సీపీఎం, సీపీఐ నాయకులు గంటా శ్రీరామ్, రాజాన దొరబాబు, జగన్నాథపురం గ్రామ సర్పంచ్ ముప్వల రాము, మొల్లి అప్పారావు, దొరబాబు, రాజు, తాతలు పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కశింకోట: విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గుర్తుతెలియని వ్యక్తి(50) మృతి చెందినట్లు ఎస్ఐ ప్రసాదరావు గురువారం తెలిపారు. మండలంలోని బయ్యవరంలో మతి స్థిమితం లేకుండా తిరుగుతున్న అతడి శరీరంపై రాళ్లు, గాజు పెంకులతో గీసుకొని గాయపడి కింద పడిపోవడంతో ఈ నెల 4వ తేదీన స్థానికులు 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించి విశాఖ కేజీహెచ్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. వీఆర్వో జీఎస్ఎస్‌కే పృథ్వీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతుని సంబంధీకులుగానీ బంధువులుగానీ పోలీసు స్టేషన్ నంబర్ 9154879713 గాని, సీఐ నెంబర్ 9440796088కు గాని, తన సెల్ నెంబర్ 8639009755కుగాని ఫోన్ చేయాలని కోరారు.

యువకుడి అనుమానాస్పద మృతి



మృతి చెందిన ప్రేమాంజనేయ మృతదేహం, (ఇన్‌సెట్) ప్రేమాంజనేయ(ఫైల్)

మాకవరపాలెం: మండలంలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన యాకా ప్రేమాంజనేయ(23) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. డిగ్రీ వరకు చదువుకుని ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్న అతడు బుధవారం రాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో రామన్నపాలెం నుంచి యరకన్నపాలెం వెళ్లే మార్గంలోని ఓ నేల బావిలో శవమై కనిపించాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ రామకృష్ణారావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉందని, అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి



పెంటయ్య మృతదేహం

కె.కోటపాడు: మండలంలో దాలివలస గ్రామానికి చెందిన రైతు దమ్ము పెంటయ్య(50) పాముకాటుకు గురై గురువారం మృతి చెందాడు. రైతు పెంటయ్య తన పొలంలో తుప్పలను తొలగిస్తున్న సమయంలో ఆయన చేతిపై పాము కాటు వేసింది. దీంతో స్థానికులు కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యం పొందుతున్న క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. అతడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎ.కోడూరు ఎస్ఐ రమేష్ కేసును నమోదు చేశారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

క్లుప్తంగా

మత్తులో పట్టణ యువత



పట్టణ సీఐ విజయకుమార్‌ను శాలువాతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనకాపల్లి: పట్టణ యువతలో మత్తు పదార్థాల వినియోగం ఎక్కువగా ఉందని, పోలీస్ శాఖ దృష్టి సారించాలని రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ కోరారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో ఇటీవల నూతనంగా విధుల్లో చేరిన సీఐ టి.వి.విజయకుమార్‌ను గురువారం ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పార్టీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కె.ఎం. నాయుడు, జిల్లా కార్యదర్శి పిల్లా రాజు, ఎన్టీఆర్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ మునురు శ్రీను పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: పట్టణంలోని డి–1 సెక్షన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాంధీనగరం, అంజయ్యకాలనీ, మిరియాల కాలనీ, లక్ష్మీదేవిపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కొన్నింటి ధరలు తగ్గాయి. బెట్టు మీద ఉన్న వంకాయ ధర దాదాపు సగానికి తగ్గింది. కిలో రూ.40కి అమ్మకాలు సాగాయి. ఇదే ధరకు టమాటా, బీరకాయ, బంగాళదుంప, బెండకాయ విక్రయాలు జరిగాయి. ఉల్లి రూ.50 నుంచి రూ.60, బీట్‌రూట్, క్యారెట్, కాకరకాయ రూ.60కి విక్రయాలు సాగాయి.

మర్రి చెట్లను నరికేశారు

సబ్బవరం: అనకపల్లి–లంకెలపాలెం రోడ్డులో ఎరుకునాయుడుపాలెం వద్ద భారీ మర్రి చెట్లను కొందరు నరికేశారు. ఆర్ అండ్ బీ ప్రధాన రహదారిలోని భారీ వృక్షాలను ఎలాంటి అనుమతుల్లేకుండా కట్ చేయడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆర్ అండ్ బీ ఏఈ కృష్ణారావును వివరణ కోరగా విషయం తన దృష్టికి వచ్చిందన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 133 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,3800	4,700
రెండో రకం	3,500	4,450
మూడోరకం	3,000	3,380

అనకాపల్లి సినిమాలు

మారుతీనగర్ సుబ్రమణ్యం : రాజా(మార్నింగ్ షోషో)
మిస్టర్ బచ్చన్ :రాజా(మ్యాట్నీ, సెకండ్‌షో)
తంగలాన్ : సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు :సత్యనారాయణ స్క్రీన్-2
సింబా :పర్తిసాయి
శ్రీలక్ష్మీనరసింహ(జ్యోతి)జామి:షిర్డీసాయి
డబుల్ ఇస్మార్ట్ : వెంకటేశ్వర
నేను కీర్తన : శ్రీసత్య
డిమోంటి కాలనీ2: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్–16 యూనిట్లు, ఓ పాజిటివ్–20 యూనిట్లు, ఏబీ పాజిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 328 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 195 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

పటిష్టమైన రక్షణ కల్పించాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టరును దారుణంగా హత్య చేసిన నిందితులను తక్షణమే కఠినంగా శిక్షించాలి. ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులను పాశవికంగా హత్య చేయడం శోచనీయం. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బందికి పటిష్టమైన రక్షణ కల్పించాలి.

– సిహెచ్.సత్యనారాయణ, ఎంపీహెచ్ఈవో, పీహెచ్‌సీ, కశింకోట

ధైర్యం కల్పించాలి



కోల్‌కతా మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. ప్రతి మహిళా వైద్యసిబ్బందికి తాము పనిచేస్తున్న ప్రదేశంలో పూర్తి భద్రతతో ఉన్నామని ధైర్యం కల్పించాలి. అప్పుడే మేము భయపడకుండా పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందించగలుగుతాం.

-రేవతి, ఏఎన్ఎం, 4వ సచివాలయం, అనకాపల్లి

మట్టి గణనాథులకే జై...

- తయారవుతున్న మట్టి విగ్రహాలు
- వీధివీధినా ఏర్పాటు చేసేందుకు సన్నద్ధం
- ఆకట్టుకుంటున్న వివిధ రూపాల్లో ప్రతిమలు



మట్టి వినాయక విగ్రహాలు



విజయరామరాజుపేట వద్ద మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న దాతలు (ఫైల్)

అనకాపల్లి: వినాయక చవితి అంటే చాలు చిన్నారులకు, యువతకు, పెద్దలకు ఎనలేని ఉత్సాహం.. వివిధ రకాల్లో గణనాథుల విగ్రహాలను ఏర్పాటు చేసి విక్రయాలను సిద్ధంగా ఉంచుతారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను మాత్రమే పూజించాలని పర్యావరణ పరిరక్షణ స్వచ్ఛంద సేవా సంస్థలు ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రచారాలు చేస్తున్నాయి. తొమ్మిది రోజులపాటు వినాయకునికి రోజుకో విధంగా పూజలు చేస్తారు. శక్తి కొలది అన్నదాన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. భవిష్యత్‌లో చేపట్టే ప్రతిపనిలో విఘ్నాలు కలగకుండా ఉండేందుకు భక్తుల నుంచి తొలిపూజ అందుకునే గణనాథుని విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. వచ్చే నెల 7వ తేదీన భాద్రపద శుద్ధ చవితి రోజున ప్రారంభయ్యే వినాయక చవితి ఉత్సవాల్లో పూజలందుకోనున్న గణనాథులు విగ్రహాలను వివిధ రకాల రూపాల్లో ఆకర్షించే రంగులతో ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవ కమిటీలు కూడా ఖర్చుకు వెనకాడడం లేదు.

పట్టణంలో వినాయక తయారీ కేంద్రాలు...

పట్టణంలోని 18 ప్రాంతాల్లో మట్టి గణపతులను శిల్పులు తయారు చేస్తున్నారు. ఐదు సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని వీటిని తయారు చేస్తున్నారు. ఇప్పటికే చాలా మంది శిల్పిలకు వివిధ రూపాల్లో విగ్రహాలు తయారు చేయాలని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఆర్డర్లు ఇచ్చారు. శిల్పులు ఐదు మాసాలుగా వీటి తయారీలో నిమగ్నమై ఉన్నారు. రెండడుగుల విగ్రహం నుంచి 12 అడుగుల ఎత్తయిన మట్టి, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలను తయారు చేసి అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

అపార్టుమెంట్, వీధి రహదారుల్లో సందడి...

గతంలో వినాయక ప్రతిమలను ప్రధాన కూడళ్లలో రెండు, మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించేవారు. నేడు పట్టణ, మండలంలో ప్రతీ వీధిలోనూ అపార్టుమెంట్లలో ఎత్తయిన విగ్రహాలు ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నారు. పట్టణ పరిధిలో సుమారుగా 60, మండల పరిధిలో సుమారుగా 40 వినాయక మండపాల వరకు ఏర్పాటు చేసి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఉత్సవాల ఏర్పాటుకు చిన్న, పెద్ద అని తేడా లేకుండా ఆసక్తి చూపటంతో విగ్రహాల కొనుగోలు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సమయం దగ్గర పడుతున్న కొద్దీ విగ్రహలు అందుబాటులో ఉండవని, అధిక ధరలు పలుకుతాయనే ఉద్దేశంతో ముందుగానే కొంత సొమ్ము చెల్లించి తనకు ఇష్టమైన విగ్రహాలను తయారు చేయించుకుంటున్నారు.

ఆకాశాన్నంటుతున్న ధరలు...

వివిధ రూపాలలో ఆకర్షించే రంగులతో వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. సైజును బట్టి ఒక్కొక్కటి రూ.3 వేల నుంచి రూ.50 వేల వరకూ పలుకుతోంది. వీధిల్లో ఏర్పాటు చేసిన పందిళ్ల వద్ద పదడుగుల లోపు విగ్రహాలను మాత్రమే తీసుకెళ్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గణపతి విగ్రహాలను నవరాత్రులకు సిద్ధం చేస్తున్నారు. పెద్ద వినాయక విగ్రహాలను మెయిన్‌రోడ్డులో నిలిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ రకాల రూపంలో తయారు చేయించుకుని మండపాలు సిద్ధం చేస్తున్నారు.

వ్యాపారం బాగుంటుందని ఆశిస్తున్నాం...

పట్టణంలోని 18 ప్రాంతాల్లో విగ్రహాలను శిల్పులు తయారు చేస్తున్నారు. ఇప్పటికే ఉత్సవ విగ్రహాల కమిటీ సభ్యులు ఇచ్చిన ఆర్డర్ ప్రకారం తయారు చేస్తున్నాం. ఎక్కువగా మట్టి విగ్రహాలను తయారు చేయడం వల్ల పెద్దగా లాభాలు రావడం లేదు. భావితరాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని మట్టి విగ్రహాలను మాత్రమే తయారు చేస్తున్నాం. ఈసారి వాతావరణం అనుకూలించి వ్యాపారం బాగుంటుందని ఆశిస్తున్నాం.

– ప్రసాద్, శిల్పి, పెరుగుబజార్ జంక్షన్, అనకాపల్లి

అడ్డాంలో తాగునీటి పనులు ప్రారంభం



పైపులైన్ నిర్మాణ పనులు

కశింకోట: మండలంలోని అడ్డాం గ్రామంలో ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు పైపులైన్ వేసే పనులను మాజీ సర్పంచ్ రెడ్డి కన్నబాబు గురువారం ప్రారంభించారు. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణల సూచనల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కూటమి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం స్వర్ణపుష్పార్చన వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులందించారు. పూజలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

వైభవంగా మరిడిమాంబ పండగ



మరిడిమాంబను దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పరవాడ: మండల కేంద్రంపరవాడ గ్రామంలో కొలువుదీరిన మరిడిమాంబ అమ్మవారి పండగను గ్రామ ప్రజలు గురువారం ఘనంగా నిర్వహించారు. పండగను పురస్కరించుకుని భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పండగలో భాగంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడులు అమ్మవారిని దర్శించుకొని పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ప్రారంభించి, భక్తులకు వడ్డించారు.

సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో అన్నసమారాధనలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బి.రామారావు, పైల హరీష్, వర్రి లక్ష్మీ అప్పలనాయుడు, పైల పైడింనాయుడు, సీహెచ్ శ్రీనివాసరావు, గండి రాము, సీహెచ్ సన్యాసిరావు, చుక్క తాతాజీ అమ్మవారిని దర్శించుకొని పూజలు జరిపారు.

ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికుల ఇక్కట్లు



యలమంచిలి-పరవాడ రహదారిలో నిలిచిపోయిన వాహనాలు

పరవాడ: యలమంచిలి–గాజువాక రహదారిలో ఊటగెడ్డ కూడలి–పరవాడ మధ్య గురువారం ఉదయం ట్రాఫిక్ జామ్ కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఊటగెడ్డ కూడలి వద్ద రెండు భారీ వాహనాలు ఇరుక్కుపోవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం దీనికి తోడై, రోడ్లు అధ్వానంగా మారాయి. ఉదయం 9–10 గంటల సమయంలో ఎన్టీపీసీ, ఎస్ఈజెడ్, హిందూజా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల రాకపోకలతో రద్దీగా మారడం, ఆపై ట్రాఫిక్ జామ్ కావడంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాల రాకపోకలకు అవస్థలు ఎదురయ్యాయి. చేసేది లేక చిన్న వాహనాలన్నీ వెన్నెలపాలెం మీదుగా రాకపోకలు సాగించడంతో ఆ రోడ్డులో కూడ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి, వాహనదారులు ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.

గిడుగు, ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి

- పాఠశాలల్లో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలు



కశింకోట బాలికల హైస్కూలులో గిడుగు చిత్రం గీసిన బాలికకు ఉపాధ్యాయుల అభినందన



హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రాన్ని గీసిన విద్యార్థులకు అభినందన



తాళ్లపాలెంలో తెలుగుదనం ఉట్టిపడేలా విద్యార్థుల వేషధారణ

కశింకోట: స్థానిక హైస్కూళ్లలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బాలికల హైస్కూలులో విద్యార్థినులకు పద్యాలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తెలుగుదనం ఉట్టిపడేలా విద్యార్థినుల వేషధారణ ఆకట్టుకుంది. అదేవిధంగా హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రాన్ని బోర్డుపై గీసిన విద్యార్థులను పీడీ పెంటకోట కమల అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, స్కూలు కమిటీ చైర్మన్ ఆళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక డీపీఎన్ హైస్కూలులో తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు తెలుగు క్విజ్, వ్యాస రచన, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముందుగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆచంట రవి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. తాళ్లపాలెంలోని ఓ ప్రైవేటు స్కూలులో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు తల్లి రూపం, తెలుగుదనం ఉట్టిపడే విధంగా సంప్రదాయ వేషధారణలతో విద్యార్థులు అలరించారు. తెలుగు నాటకం, పొడుపు కథలు ప్రదర్శించారు. కరస్పాండెంట్ బి.రామ్‌కుమార్, హెచ్ఎం వై.నగేష్, తదితరులు పాల్గొన్నారు.
- వెదుపర్తి జెడ్పీ హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు, పాటలు, పద్యాల పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తెలుగు ఉపాధ్యాయిని సత్యవాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడిపాలెంలో..

తుమ్మపాల: క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, విద్యార్థి దశ నుంచి అలవర్చుకోవడం ద్వారా శారీరక మానసిక ఆరోగ్యం చేకూరుతుందని ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ తెలిపారు. మామిడిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన క్రీడా దినోత్సవంలో హాకీ క్రీడా దిగ్గజం స్వర్గీయ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. వ్యాయామ ఉపాధ్యాయిని లంబా గౌరి, ఉపాధ్యాయులు బాబు, గొంది చినబ్బాయ్, వసంతరావు, విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యం, శ్రీను, కరుణ జ్యోతి, ఉమా, ప్రసాద్, ఎ.లక్ష్మి, కామేశ్వరరావు, బాల సరస్వతి పాల్గొన్నారు.



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న హెచ్ఎం రవి

వర్షంతో ప్రజానీకం అవస్థలు

- బురదమయంగా పీహెచ్‌సీ రోడ్డు, ఆర్టీసీ బస్ స్టేషన్



వర్షంతో బురదమయంగా మారిన కశింకోటలో ఆర్టీసీ బస్సు స్టేషన్ ఆవరణ



వర్షంతో కశింకోట పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు అధ్వానం



వారపు సంతలో కొనుగోలుదారులు లేక నిరాశ

కశింకోట: మండలంలో గురువారం కురిసిన వర్షంతో ప్రజానీకం తీవ్ర అవస్థలు పడ్డారు. బురదమయంగా మారిన స్థానిక పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో జాతీయ రహదారి నుంచి రాకపోకలు సాగించడానికి ప్రజలతోపాటు వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కొందరు వాహన చోదకులు జారి కింద పడ్డారు. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆర్టీసీ బస్ స్టేషన్ చిత్తడిగా మారింది. దీంతో ప్రయాణికులు బస్సులు ఎక్కి, దిగేందుకు ఆపసోపాలు పడ్డారు. స్థానిక వారపు సంత వెలవెలబోయింది. సరైన బేరాలు లేక వ్యాపారులు ఉసూరుమన్నారు. సాయంత్రం మాత్రం వర్షం కాస్త తగ్గడంతో ముమ్మరంగా వ్యాపారం సాగింది. తమకు కావలసిన కూరగాయలు, మసాల దినుసులు వగైరా పలువురు కొనుగోలు చేశారు. వర్షం వల్ల వరి రైతులకు మేలు చేస్తోందని, వరి నాట్లు వేయడానికి, నాట్లు వేసిన పొలాలకు ఉపకరిస్తుందని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన తప్పనిసరి

- జలజీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ పుల్లయ్య



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ పుల్లయ్య

తుమ్మపాల: వ్యక్తిగత శుభ్రతతోపాటు మంచినీరు వాడుకునే విధానాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జలజీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ పుల్లయ్య తెలిపారు. తుమ్మపాల జెడ్పీ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జల జీవన్ మిషన్ కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. తుమ్మపాల పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీ పెర్సిసు మాట్లాడుతూ దోమలు కుట్టడం వల్ల వచ్చే వ్యాధులు చాలా ప్రమాదకరమైనవన్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలు కౌమార దశలో ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. బాలికల వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ రాజరాజేశ్వరి మాట్లాడుతూ రోజూ చేతులను శుభ్రంగా కడుక్కొని వేడి వేడి పదార్థాలు భుజించాలని, కాలానగుణంగా ఆకు కూరలు దుంపకూరలు ఎక్కువగా తినాలన్నారు. శారద వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ చైతన్య, జల జీవన మిషన్ రిసోర్స్ పర్సన్లు కోన అప్పారావు, వి.చక్రవర్తి, కె. జయలక్ష్మి, స్కూల్ కమిటీ చైర్మన్లు బలరాం, గగనం జ్యోతి పాల్గొన్నారు.

అనాథాశ్రమాలు, గురుకులాల్లో తనిఖీలు



వెదుళ్లనరవలోని చిల్డ్రన్ అఫ్ ఫెయిత్ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

సబ్బవరం: మండలంలోని పలు అనాథ శరణాలయాలను, గురుకుల పాఠశాలలను సీఐ పిన్నింటి రమణ, సీడీపీవో లలిత్ కుమారి తదితరుల బృందం గురువారం సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కోటవురట్లలోని ఆశ్రమ వసతిగృహంలో విద్యార్థులు కలుషితాహారం తిని, అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. మండలంలోని బోదువలస రిషి గురుకులం, దేవీపురంలోని డాన్ బాస్కో వసతి గృహం, వెదుళ్లనరవలోని చిల్డ్రన్ ఆఫ్ ఫెయిత్ వసతి గృహాల వంట గదులను, సరకులను పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలిచ్చారు. వీరి వెంట డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, వీఆర్వో వెంకటేష్ తదితరులు ఉన్నారు.